సాక్షి కర్నూలు

సోమవారం ‌। 12 ‌। ఫిబ్రవరి ‌। 2024



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు.



శ్రీశైలంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

శ్రీశైలం టెంపుల్: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందిరేష్ ఆదివారం రాత్రి శ్రీశైలం వచ్చారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు.



హోరాహోరీగా..

కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి హాకీ బాలుర చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో కర్నూలు జట్టు సెమీస్‌కు చేరింది. 8లో▸

ఉపాధిలో రికార్డు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కరువు ప్రాంతాలకు ఊరట

- ఉపాధి నిధులతో జలసంరక్షణ పనులకు ప్రాధాన్యం
- జిల్లాలో పెద్ద ఎత్తున అమృత్ సరోవర్‌లు
- 2023–24 సంవత్సరానికి 90లక్షల పనిదినాలు లక్ష్యం
- ఫిబ్రవరి 9 నాటికే 90.06 లక్షల పనిదినాల కల్పన
- ఈ ఏడాది కోటికి పైగా పని దినాల కల్పన దిశగా అడుగులు
- కూలీలకు వేతనంగా రూ.352.31 కోట్ల చెల్లింపు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు పరిస్థితుల నుంచి ప్రభుత్వం ఉపాధి పనులతో గట్టెక్కించింది. ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి ప్రాజెక్టు డైరెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయడం వల్ల లక్ష్యాన్ని మంచి పనిదినాలు కల్పించినట్లు స్పష్టమవుతోంది. 2019–20 నుంచి యేటా ఉపాధి పనులకు ఆదరణ పెరుగుతోంది. టీడీపీ పాలనలో, అంటే 2018–19లో 62.35 లక్షల కుటుంబాలకు మాత్రమే పనులు కల్పించినట్లు స్పష్టమవుతోంది. అప్పట్లో ప్రజల ఉపాధి కంటే పచ్చపార్టీ నేతలు తమ ఉపాధి, తాము ఎలా జేబులు నింపుకోవడం అనే కోణంలోనే ఈ పథకాన్ని చూశారు. అప్పట్లో 20 శాతం నిధులు ఖర్చు చేసి 80 శాతం నిధులు కొల్లగొట్టారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక శాశ్వత పనులపై దృష్టి సారించింది. మొదటిసారిగా, అంటే 2023–24లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 30 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించి వలసలను నివారించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడింది. 2018–19 సంవత్సరం వరకున్న పరిస్థితులతో పోలిస్తే ఏడాదికేడాది వలసలు తగ్గుతూ వస్తున్నాయి. ఈ ఏడాది కరువు పరిస్థితులు నెలకొన్నా.. వలసలు నామమాత్రంగానే ఉన్నాయంటే ఉపాధి పనులే కారణంగా తెలుస్తోంది.

కూలీలకు రూ.352.31 కోట్ల వేతనాలు

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. 2019–20లో 67.49 లక్షల పని దినాలు కల్పించగా.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా 91.56 లక్షల పని దినాలు కల్పించి జిల్లా నీటియాజమాన్య సంస్థ రికార్డు సృష్టించింది. 2023–24 కర్నూలు జిల్లాలో కూలీలకు వేతనాల కింద రూ.352.31 కోట్లు చెల్లించారు. ఉపాధి కూలీలకు సగటున రూ.265 ప్రకారం వేతనాలు లభించాయి. నంద్యాల జిల్లాలో రూ. 232 కోట్లు చెల్లించగా.. కూలీలకు గరిష్ట వేతనం రూ. 272 లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి వలసలు నియంత్రించడంలో ఉపాధి పనులు ఇతోధికంగా తోడ్పడ్డాయి.

2018-19 నుంచి ఉపాధి పనుల ప్రగతి ఇలా..

సంవత్సరం	కల్పించిన పనిదినాలు(లక్షల్లో)
2018-19	62.35
2019-20	67.49
2020-21	84.71
2021-22	82.88
2022-23	91.56
2023-24	90.06

(ఫిబ్రవరి 9 నాటికి మాత్రమే)

జలసంరక్షణ పనులకే ప్రాధాన్యం

2023–24 సంవత్సరంలో ఉపాధి నిధులతో పెద్ద ఎత్తున పనులు చేపట్టారు. జలసంరక్షణ, వర్షపు నీరు భూమిలోకి ఇంకింపజేసేందుకు అవసరమైన పనులు మాత్రమే చేపట్టడం వల్ల భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. ప్రధానంగా ఉపాధి నిధులతో ఆరు రకాల పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. వాటర్ కన్జర్వేషన్, వాటర్ హార్వెసింగ్ పనులు చేపడుతున్నారు. అమృత్ సరోవర్‌లు, మైక్రో ఇరిగేషన్ పనులు, కమ్యూనిటీ ఫాంపాండ్స్, రైతుల వ్యక్తిగత భూముల్లో వివిధ రకాల పనులు కల్పించడం, భూగర్భ జలాల వృద్ధి లక్ష్యంగా ఉపాధి నిధులతో 80 చెరువులను అభివృద్ధి చేయడం విశేషం. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా వాటర్‌షెడ్ నిధులు రూ.58.81 లక్షలతో జిల్లాలో 9 చెరువులను కొత్తగా నిర్మించగా.. మరో చెరువును ఆధునీకరించారు. హాలహర్వి మండలంలో 3, కృష్ణగిరి, ఓర్వకల్, ఎమ్మిగనూరు మండలాల్లో రెండేసి చొప్పున కొత్త చెరువులను నిర్మించారు. 10వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో అంటే కోటి లీటర్ల సామర్థ్యంలో కొత్త చెరువులను నిర్మించడంతో గ్రామాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. వర్షాలు పడి చెరువులు నిండితే ఆయా గ్రామాల్లో తాగు, సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో 2వ స్థానం

2023–24లో అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి కల్పించడంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 2వ స్థానంలో ఉండటం విశేషం. తిరుపతి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండగా.. కర్నూలు జిల్లా 90.06 లక్షల పని దినాలతో 2వ స్థానం దక్కించుకుంది. నంద్యాల జిల్లాలో 75 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 69.14 లక్షల పని దినాలు కల్పించారు. కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో ఆరు మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఈ మండలాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి పనులపై విస్తృతంగా నిర్వహించారు. దీంతో వలసలు తగ్గుముఖం పట్టాయి.

వలస వెళ్లిన కుటుంబాలు 8,605 మాత్రమే

ఉపాధి పనులు నిర్వహించే గ్రామీణ ప్రాంతాల్లో 3,29,619 కుటుంబాలు ఉండగా.. ప్రస్తుతం 8,605 కుటుంబాలు మాత్రమే వలస వెళ్లాయి. ఈ కుటుంబాలకు సంబంధించి 16,986 మంది ప్రస్తుతం వలస వెళ్లినట్లు డ్వామా యంత్రాంగం నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. వలస వెళ్లిన కుటుంబాల్లో ఎస్సీలు 3,256 , ఎస్టీలు 296, బీసీలు 4,729, మైనార్టీలు 225, ఇతరులు 96 కుటుంబాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు కల్పించడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడం, పండ్లతోటల అభివృద్ధి తదితర కారణాల వల్ల వలసలు తగ్గినట్లు స్పష్టమవుతోంది.

వంద రోజుల పనిదినాలు వినియోగించుకున్నాం



మేమిద్దం ఉపాధి పనులకు పోతున్నాం. మా గ్రామంలో అడిగిన వెంటనే ఉపాధి పనులు కల్పిస్తున్నారు. మేము వంద రోజుల పని దినాలను వినియోగించుకున్నాం. మాకు రూ.26,985 వేతనం వచ్చింది. రోజుకు రూ.269 కూలి లభించింది. మా మండలాన్ని ప్రభుత్వం కరువు ప్రాంతంగా గుర్తించింది. దీంతో మాకు మరో 50 పని దినాలు కల్పించాల్సి ఉంది. ఈ పని దినాలను కూడా వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. – చిన్న దేవన్న, నాగేశ్వరమ్మ తిప్పాయిరెడ్డి, ఓర్వకల్ మండలం

ఉపాధి పథకం అండగా నిలిచింది



మాకు ఉపాధి పనులే ఆధారం. గతంలో స్థానికంగా ఉపాధి పనులు లేక వలస వెళ్లేవాళ్లం. ఐదేళ్లుగా గ్రామంలో క్రమం తప్పకుండా పనులు కల్పిస్తున్నారు. మేము ఎక్కువగా వ్యవసాయ పనులకు పోతుంటాం. వ్యవసాయ పనులు లేనపుడు ఉపాధి పనులను వినియోగించుకుంటాం. మేము ఇప్పటికే 100 రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నాం. మాకు 100 రోజులకు రూ.27,100 వేతనం లభించింది. గతంతో పోలిస్తే కూలీలకు ఉపాధి అండగా నిలుస్తోంది. – జి.విరుపాక్షి, అరేకల్, ఆదోని మండలం

లక్ష్యానికి మించి పనులు కల్పించాం



ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయడం వల్ల లక్ష్యానికి మించి ఉపాధి పనులు కల్పించాం. కరువు జిల్లాకు ఉపాధి వరంగా మారింది. 2023–24లో 90 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. ఫిబ్రవరి 9వ తేదీ నాటికి 90.06 లక్షల పని దినాలు కల్పించాం. మార్చి చివరి నాటికి మరో 10 లక్షల పని దినాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి నిధులతో ప్రజోపయోగ పనులకే ప్రాధాన్యత కల్పిస్తున్నాం. – అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

న్యూస్‌రీల్

దిశ మహిళా పీఎస్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బాబుప్రసాద్

కర్నూలు: దిశ మహిళా పీఎస్ కర్నూలు డీఎస్పీగా నియమితులైన జె.బాబు ప్రసాద్ విధుల్లో చేరారు. ఇక్కడున్న సుధాకర్‌రెడ్డిని చిత్తూరు దిశ పీఎస్‌కు బదిలీ చేసి అక్కడున్న బాబు ప్రసాద్‌ను కర్నూలు దిశ పీఎస్‌కు నియమిస్తూ ఈనెల 1వ తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్ జిల్లాకు చెందిన బాబుప్రసాద్ 1991లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి అనంతపురం జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. 2004లో సీఐగా పదోన్నతి పొంది 2013 వరకు కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొంది కర్నూలు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పనిచేస్తూ గత ఎన్నికల ముందు నెల్లూరు జిల్లాలోని గూడూరుకు బదిలీపై వెళ్లారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా ఈయనను కర్నూలుకు బదిలీ చేయడంతో ఆదివారం సాయంత్రం స్టేషన్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు.

జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 77 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించారు. ఉదయం 3,444 మందికిగాను 3,339 మంది, మధ్యాహ్నం 2,799 మందికిగాను 2,717 మంది హాజరయ్యారు.

నేడు 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇద్దరు ఎస్‌ఐలకు స్థానచలనం

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు యూపీఎస్‌లో పనిచేస్తున్న జి.కృష్ణమూర్తి మాధవరం పీఎస్‌కు, అక్కడున్న డి.కిరణ్ బాబును అవుకు పీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆకట్టుకున్న ఇన్‌స్పైర్ మనక్



ప్రదర్శనను తిలకిస్తున్న డీఈఓ శామ్యూల్

కర్నూలు సిటీ: పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, నైపుణ్యాలను వెలికితీసేందుకు నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ 2022–23 ప్రదర్శన ఆకట్టుకుంది. కర్నూలు శ్రీరామ్‌నగర్‌లోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం ఈ కార్యక్రమాన్ని డీఈఓ కాగిత శామ్యూల్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రదర్శించిన ప్రాజెక్టులు చక్కగా ఉన్నాయన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో జిల్లాకు చెందిన ప్రాజెక్టులు ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రీసెర్చ్ అసోసియేట్ అమిత్ జైన్ మాట్లాడారు. మొత్తం 131 స్కూళ్లకు చెందిన బాల బాలికలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సైన్స్ కో–ఆర్డినేటర్ రంగమ్మ, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

మిర్చి క్వింటా రూ.26,299

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం బ్యాడిగ రకానికి చెందిన మిర్చి క్వింటా ధర రూ.26,299 పలికింది. యార్డుకు మొత్తం 1,406 సంచులు దిగుబడి వచ్చింది. డాబా రూ.18,009, తేజ రూ.18,050, పింజంట రూ.16,229, సూపర్–10 రూ.16,900, త్రిమూర్తి రూ.16,200, పటాడ్ రూ.16,399, ఎస్ఎస్ రకానికి రూ. 18,518 ప్రకారం గరిష్ట ధర లభించింది.

అహోబిలేశునికి నీరాజనం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: తన వివాహ మహోత్సవానికి భక్తుల ఆహ్వానించేందుకు పల్లకీలో బయలుదేరిన అహోబిలేశునికి సర్వాయిపల్లె గ్రామస్తులు నీరాజనం పలికారు. పార్వేటలో భాగంగా అహోబిలేశుడు సంక్రాంతి పర్వదినాన అహోబిలం కొండ దిగిన ప్రహ్లాద వరద స్వామి, జ్వాలా నరసింహ స్వామి బాచాపురంలో భక్తుల నుంచి మొదటి పూజ అందుకున్నారు. ఆ తర్వాత 25 రోజుల తర్వాత ఆదివారం స్వామివార్లకు సర్వాయిపల్లెలో ఏకాంత అభిషేకాలు నిర్వహించారు. ఏటా ఈ కార్యక్రమాన్ని ఇదే గ్రామంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కొనసాగే పారువేట ఉయ్యాలవాడ మండలంలో కేవలం ఈ ఒక్క గ్రామానికే పరిమితం కావడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సర్వాయిపల్లెకు వేలాదిగా తరలివచ్చి పూజలు చేశారు. ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో కోనేటి నీటితో పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం క్షీర, పంచామృతాభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన సన్నిది సుబ్రమణ్యం శ్రేష్టి కుటుంబ సభ్యులు, గ్రామ వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు సరాబు దస్తగిరి, గిరిధర్‌బాబు, గ్రామ సర్పంచ్ ఉమ, మాజీ సర్పంచ్ ఆవుల రాఘవేంద్రారెడ్డి, గ్రామ పెద్దలు పూజలు చేశారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయండి

- శ్రీశైలం ఈఓ పెద్దిరాజు



సమీక్ష నిర్వహిస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాట్లను వేగవంతం చేయాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. ఆదివారం దేవస్థాన పరిపాలన భవనంలో నిర్వహించిన సమీక్షలో దేవస్థాన అన్ని యూనిట్ విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు దర్శనం ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, అన్నప్రసాద వితరణ, శివదీక్షా భక్తులకు ఏర్పాట్లు మొదలైన అంశాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లుగా అన్ని విభాగాల వారు గత సంవత్సరం కంటే 20 శాతం మేరకు అధికంగా ఆయా ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. క్యూలైన్ల నిడివిని పెంచాలన్నారు. క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయం, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీసు శాఖ సహకారంతో క్యూలైన్ల నిర్వహణను పకడ్బందిగా చేపట్టాలని సూచించారు. క్యూకాంప్లెక్స్‌లో మంచినీరు, అల్పాహారం అందించాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ జరుపుతుండాలన్నారు. తగినంత సంఖ్యలో ముందుగానే లడ్డూప్రసాదాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. భక్తులు వీలుగా క్షేత్రపరిధిలో విస్తృతంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, ఏఈవో మల్లికార్జునరెడ్డి, హరిదాసు, పర్యవేక్షకులు, పీఆర్వో టి.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ ఎడిటర్ డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా



కష్టాలు తొలగాయి



మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గ్రామంలో మొదట్లో వివిధ రకాల పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. చేతిలో ఉన్న మొత్తాన్ని ఖర్చు చేసి ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాం. కుమారుడి చదువుకు ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా కష్టాలు తొలగాయి. నేను పొదుపు గ్రూపులో ఉండటంతో ఆసరా పథకం ద్వారా రూ. 9,480 వచ్చాయి. పొదుపులో కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకుని టీ కొట్టు పెట్టుకున్నా. కటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ఉంది. మమ్మల్ని ఆదుకున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – కురుబ రంగమ్మ, ఆలూరు

మేలును మరవలేం



మాది తుగ్గలి మండలం పెండేకల్లు. తల్లిదండ్రులు ద్వారా మాకు వచ్చిన కాస్త స్థలం చాలా వరకు రోడ్డు వేసినప్పుడు పోయింది. దీంతో ఇల్లు కట్టుకునేందుకు స్థలం, కట్టుకునే స్తోమత లేక కొన్నేళ్లుగా బస్టాండ్‌లో నివాసం ఉంటున్నాం. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికారులు, నాయకులను ఇంటి కోసం అడిగినా పట్టించుకోలేదు లేదు. జగన్ ముఖ్యమంత్రి కావడంతో ఊరికి ఆనుకొని ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఉచితంగా సెంటున్నర స్థలం ఇచ్చి, ఇల్లు మంజూరు చేశారు. ఇప్పటికే ఇంటి బిల్లు రూ.1.50 లక్షలు అందింది. అవసరమైన ఇంటి సామాగ్రి ఇవ్వడంతో ఇల్లు కట్టుకున్నాం. ఇంటి నిర్మాణం పూర్తికావచ్చింది. త్వరలో ఇంట్లో చేరబోతున్నాం. జగనన్న చేసిన మేలును మరవలేం. – మాధమ్మ, కాశీం దంపతులు

ఇళ్ల స్థలాలపై పేదలకు సంపూర్ణ హక్కు

- జిల్లాలో వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- ఇప్పటి వరకు 32,775 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్
- మిగిలిన పట్టాలను ఫిబ్రవరి 15లోపు రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు
- త్వరలోనే రిజిస్ట్రేషన్ చేసిన కన్వేయన్ డీడ్‌లను ఇచ్చేందుకు చర్యలు
- జిల్లాలో 1,08,953 మందికి ఇళ్ల పట్టాలు



కోడుమూరులోని సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా వాటిపై పూర్తిహక్కు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలోని 672 సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందుకు అయ్యే రిజిస్ట్రేషన్ వ్యయాన్ని కూడా భరిస్తోంది. గతంలో ప్రభుత్వాలు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినా స్థలం పైన పేదలకు పూర్తి హక్కు ఉండేది కాదు. అయితే ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు పదేళ్ల తర్వాత సర్వ హక్కులు ఉండేలా అసైన్డ్ భూములు చట్టాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సవరించింది. పది సంవత్సరాల తర్వాత ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని లబ్ధిదారులు కావాలంటే అమ్ముకోవచ్చు, ఇతర ప్రయోజనాలు కోసం వినియోగించుకోవచ్చు.

హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

జిల్లాలోని 344 వైఎస్‌ఆర్ జగనన్న కాలనీలు, ఇతర ప్రదేశాల్లో 1,08,953 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అంతేకాక 40,815 మందికి ఇళ్లను నిర్మించుకోవడానికి అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 16 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి ఆఖరు నాటికి మరో 12 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి హక్కులు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఫిబ్రవరి 2 నుంచి ఇప్పటి వరకు 32 వేలకు పైగా ఇళ్ల స్థలాలను ప్రభుత్వం తరఫున వీఆర్వోలు రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఫిబ్రవరి 15ను తుది గడువుగా పెట్టుకున్నారు. ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు 32,775 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

జిల్లాలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నారు. ప్రతి ప్లాటుకు చుట్టూ ఉన్న సరిహద్దు వివరాలు, ఇచ్చిన పట్టా ఆధారాలు సేకరించారు. ఇప్పటివరకు 326 గ్రామాల్లో 75,066 మంది లబ్ధిదారుల వివరాలను సేకరించారు. మరో 19 గ్రామాల్లో వివరాల సేకరణలో అధికారులు ఉన్నారు. సేకరించిన వివరాల్లో ఇప్పటి వరకు 32,775 ఇళ్ల పట్టాలను సంబంధిత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. మరో 42,291 ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో సేకరించిన డేటాను ఆన్‌లైన్ చేయడం, రిజిస్ట్రేషన్ చేయడం..సేకరించాల్సిన డేటాపై క్షేత్రస్థాయిలో దగ్గరుండి తేల్చే పనిలో ఉన్నారు. మొత్తంగా జిల్లాలోని అన్ని ఇళ్ల పట్టాలు ఫిబ్రవరి 15లోపు రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

పేదల చేతిలో రూ. లక్షల విలువ చేసే ఆస్తి ఉన్నట్లే

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పేదలకు ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు ఇస్తూనే ఉన్నాయి. అయితే ఇచ్చిన డీ పట్టాలను క్రమబద్ధీకరించుకోవాలంటే పేదలకు తలప్రాణం తోకకు వస్తోంది. రెవెన్యూ శాఖ ఎన్‌ఓసీ ఇవ్వడం, ఆ తరువాత రిజిస్ట్రేషన్ శాఖ దాన్ని నిషేధిత జాబితా నుంచి మార్చే ప్రక్రియ చేపట్టాలంటే ఎంతో క్లిష్టమైన అంశం. ఈక్రమంలో ఆ ప్లాట్లను పేదలు ఎంతో కొంతకు అమ్ముకొని వెళ్లేవారు. మార్కెట్ రేటు ఎంత ఉన్నా చాలా తక్కువకు అమ్మాల్సి వచ్చేది. దీంతో వారు ఆ ఆస్తి హక్కులు కోల్పోయేవారు. ఈక్రమంలో పేదల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం వారికి పెద్ద ఆస్తిని ఇచ్చినట్లు అవుతుంది. ఇది గొప్ప ముందుడుగా ప్రజలు భావిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది



పేదల ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ, వార్డు సచివాయాలయాల్లోనే రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 32,775 రిజిస్ట్రేషన్లను పూర్తి చేశాం. ఫిబ్రవరి 15లోపు అన్ని పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్ డీడ్ లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. – నారపురెడ్డి మౌర్య, జేసీ, కర్నూలు

రూపాయి తీసుకోకుండా రిజిస్ట్రేషన్ చేశారు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అన్ని మంచి పనులే చేస్తున్నారు. రూపాయి తీసుకోకుండా మాకు ఇచ్చిన ఇంటి పట్టాను సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేశారు. ఇది మాకు లక్షల విలువ చేసే ఆస్తి. ఆపద సమయాల్లో అండగా ఉంటుందని భావిస్తున్నాం. – మహబూబ్‌బీ, బస్తిపాడు, కల్లూరు

పర్యవేక్షిస్తున్న జేసీ

పేదలకు ఇచ్చిన డీ పట్టాలపై సర్వ హక్కులు కల్పించేందుకు అసైన్‌మెంట్ చట్టంలో మార్పులు చేశారు. అందులో భాగంగా పదేళ్లకు డీ పట్టాలు పొందిన వారికి సర్వ హక్కులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో పేదల ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను వేగవంతం చేసేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి జేసీ నారపురెడ్డి మౌర్య పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

హాలహర్వి: మెదేహాల్ సమీపంలో బైక్‌పై తరలిస్తున్న 672 టెట్రా ప్యాకెట్లను (కర్ణాటక మద్యాన్ని) స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన బసవరాజును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా కర్ణాటక మద్యం అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్‌ఐ నరేంద్ర, కానిస్టేబుళ్లు గోవర్ధన్, రంగనాయక్, పాండు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

దేవనకొండ: మండలంలోని దుబ్బనగుర్తి క్రాస్ దగ్గర కోటకొండ గ్రామానికి చెందిన సురేష్, శివాజీ అనే వ్యక్తులు మోటార్ సైకిల్‌పై కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు ఆదివారం విలేకరులకు తెలిపారు. కర్ణాటక మద్యాన్ని కోటకొండకు చెందిన ఎర్రబుజ్జి రంగడు దగ్గర కొనుగోలు చేసుకుని తరలిస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహిళ బలవన్మరణం

దేవనకొండ: కడుపునొప్పి తాళలేక ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉప్పర లక్ష్మి(33)కొంతకాలంగా విపరీతమైన కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతూ ఉండేది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుడు ఉప్పర కాశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి భర్త క్రిష్ణ ఉన్నారు.

చెరకు తోట దగ్ధం



కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామానికి చెందిన రైతు పాల కోటేశ్వరరావుకు చెందిన చెరకు తోట ఆదివారం సాయంత్రం దగ్ధమయ్యింది. ఈయన తడకనపల్లె రోడ్డులో తన 20 ఎకరాల్లో చెరకు నాటారు. అందులో సగం నరికారు. నిప్పురవ్వలు చెలరేగి తోటపై పడి 12 ఎకరాల్లో పంట దగ్ధమయ్యిందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న కర్నూలు అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో మంటలు ఆర్పివేసింది.

అక్రమార్కులతో 'చెలిమ'

- చెలిమ రేంజిలో యథేచ్ఛగా తరలుతున్న వృక్ష సంపద
- అడవిలో నిత్యం దుండగుల సంచారం
- పచ్చని చెట్లపై గొడ్డలి వేటు
- మైదానంగా మారుతున్న అటవీ ప్రాంతం
- ఒప్పందం మేరకే పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు!



మొబైల్ పార్టీ బృందం స్వాధీనం చేసుకున్న వెదురు,సైకిళ్లు

రుద్రవరం: నంద్యాల డివిజన్‌లోని చెలిమరేంజిలో అక్రమాలకు అంతే లేకుండా పోయింది. అటవీ ప్రాంతానికి సమాంతరంగా ఉన్న వారు నిత్యం అడవిలోకి వెళ్లి వెదురు, వివిధ జాతుల విలువైన వృక్ష సంపదను పట్ట పగలే సైకిళ్లు, ఆటోలు, ట్రాక్టర్లలో తరలించుకెళుతుంటే అడ్డుకునే అధికారులే కరువయ్యారు. అటవీ సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా చెలిమ రేంజిలోని పెద్దకంబలూరు, కోటకొండ బీట్లలో 'తరలింపు' అధికంగా సాగుతోంది. ఆయా బీట్ల నుంచి బీ.నాగిరెడ్డిపల్లె, అప్పనపల్లె, పెద్దకంబలూరు, యల్లావత్తుల, శ్రీరంగాపురం తదితర గ్రామాలతో పాటు శిరివెళ్ల మండలం బోయలకుంట్ల, మహదేవపురం, మహానంది మండలం ఆంజనేయుని కొట్టాల తదితర ప్రాంతాలకు చెందిన దుండగులు యథేచ్ఛగా అడవిలోకి వెళ్లి తమకు కావలసిన కలప, వెదురు కొట్టుకెళ్తున్నారు. అటవీ ఉద్యోగుల్లో కొందరు పట్టణాలకు పరిమితమవడం, అడవిలో వారి ఉనికి కరువవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. దీంతో పగటి పూటే వృక్ష సంపదను నరికి తరలిస్తున్నారు.

గీత దాటి ఒప్పందం..

వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నుంచి అడవిని సంరక్షించేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు, ఫైర్‌లైన్లు, యూ లైన్లు, ఎల్ లైన్లు వంటివి చేయించాలని నిధులు మంజూరు చేశారు.



ట్రాక్టర్ ట్రాలీ నిండా వివిధ జాతుల వృక్ష సంపద



పెద్దకంబలూరు వంతెన మీదుగా సైకిల్‌పై తరలిస్తున్న వెదుర్లు

వాటిని రేంజి పరిధిలోని ఆయా బీట్ల సిబ్బందికి అప్పగించారు. అయితే ఆ పనులు చేయించాలంటే ఆ నిధులు సరిపోవని కొందరు ఉద్యోగులు అడవి దొంగల నుంచి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. నిర్దేశించిన పనులు ఉచితంగా చేసి పెట్టాలని అందుకు ప్రతి ఫలంగా అడవిలో నుంచి ఏదైనా తెచ్చుకోవాలని ఇందుకు తాము చూసీ చూడనట్లు ఉంటామని ఒప్పందం కుదుర్చుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒప్పందం ప్రకారం దుండగులు అడవిలో ఉద్యోగులు సూచించిన పనులు చేశారు. అనంతరం కొండ కొల్లగొట్టడం కొనసాగిస్తున్నారు. వృక్ష సంపద పట్టపగలే తరలిపోతున్నా తమకేమీ తెలియనట్లు స్థానికులు అధికారులు నటిస్తున్నారు.

➤ చాగలమర్రికి చెందిన ఓ దుండగుడు చెలిమ రేంజిలో నుంచి వెదురు కర్రలు బొలేరో వాహనంలో తరలించుకెళ్లేందుకు కొందరు ఫారెస్టర్లకు ప్రతి నెలా కొంత సొమ్ము ముట్టజెబుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

➤ ఇందుకు.. ఇటీవల సదరు వ్యక్తి చెలిమ రేంజి పెద్దకంబలూరు బీట్‌లో దాదాపు 6 వేల వెదురు కర్రలను అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసినట్లు రుద్రవరం రేంజి అధికారులకు తెలియడంతో వారు వెళ్లి కేవలం 1,500 వెదురు కర్రలను స్వాధీనం చేసుకొని రుద్రవరం అటవీ కార్యాలయ ప్రాంగణానికి తరలించారు.

➤ అక్కడ వెదురు కర్రలు మిగిలి ఉన్నట్లు తెలుసుకున్న మొబైల్ పార్టీ బృందం దాడి చేసి మిగిలి ఉన్న 4,500 వెదురు కర్రలను స్వాధీనం చేసుకొని గాజులపల్లె కలప డిపోకు తరలించారు.

➤ అలాగే ఇటీవల కోటకొండ–పెద్దకంబలూరు బీట్లలో నుంచి అక్రమంగా వెదురు తరలిస్తున్న వారిపై మొబైల్ పార్టీ బృందం దాడి చేయగా.. 9 సైకిళ్లను వెదుర్లతో పట్టుకున్నారు.

➤ పక్క రేంజి, మొబైల్‌పార్టీ బృందం అధికారులు దాడి చేసి అక్రమాలను అడ్డుకుంటుంటే స్థానిక రెగ్యులర్ ఉద్యోగులు ఏం చేస్తున్నారనేది ప్రశ్నగా మిగిలిపోయింది.

టైగర్ జోన్ విస్తరణకు ఆటంకం

నల్లమల అటవీ ప్రాంతంలో పెద్ద పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం వాటి సంచారం రుద్రవరం రేంజి దాటి వైఎస్సార్ కడప జిల్లా వరకు విస్తరించడంతో కడప వరకు టైగర్ జోన్ టైగర్ కారిడార్‌గా ప్రకటించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుంది. పులుల మనుగడకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు కూడా చెబుతున్నారు. అలాగే అటవీ ప్రాంతాంలో జన సంచారం లేకుండా చేయాలని చర్యలు చేపట్టామని, వాటిపై ఇప్పటికే రేంజి అధికారులను ఆదేశించామని చెబుతున్నారు. అయితే కొందరు కింది స్థాయి సిబ్బంది అవేవీ తమకేమి సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంతో అక్రమాలు కొనసాగుతున్నాయి.

మా దృష్టికి రాలేదు

యథేచ్ఛగా తరలి పోతున్న వెదురు, వృక్ష సంపద, అటవీ శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు, దుండగుల మధ్య కుదిరిన ఒప్పందం గుస గుసలపై తమ దృష్టికి రాలేదు. విచారణ జరిపి సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తాం.

– ఈశ్వరయ్య, చెలిమ రేంజి అధికారి

ఘంటసాల గానం అజరామరం

- విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: ఘంటసాల వెంకటేశ్వరరావు గానం అజరామరం అని విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్ అన్నారు. పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని ఘంటసాల విగ్రహం వద్ద ఆయన 50వ వర్ధంతిని నిర్వహించారు. ఘంటసాల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాంశంకర్ నాయక్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితిలో గీతాలాపన చేసి ఆంధ్రులకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన ఆ మహానుభావుని గాన మాధుర్యాన్ని భావితరానికి అందించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సాహితీ వేత్త కె.చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ ఘంటసాల విలక్షణ గాయకులన్నారు. ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ పి.చంద్రశేఖర్, మధుర కవి ఎలమర్తి రమణయ్య, పద్మశ్రీ ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షుడు సుస్వరం వాసుదేవమూర్తి మాట్లాడారు. మధుర గాయని సుధారాణి ఘంటసాల గీతాలు, పెయింటర్ శ్రీనివాస్ శ్యామలా దండకం పద్యాలను ఆలపించారు. సమితి కార్యదర్శి రాఘవేంద్ర ప్రసాద్, కోశాధికారి జగన్నాథగుప్త, సభ్యులు పాల్గొన్నారు.

శభాష్...హరీష్ !



రక్తదానం చేయిస్తున్న హరీష్, అనూష దంపతులు

మహానంది: ప్రతి ఒక్కరూ తమ వివాహ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటారు. ఆర్థిక స్థోమతను బట్టి కుటుంబ, బంధుమిత్రులను ఆకట్టుకునేలా రుచికరమైన భోజనాలు, ఆహ్లాదకరంగా ఉండేలా ఆర్కెస్ట్రా, మిమిక్రీ తదితర కార్యక్రమాలు చేపడుతారు. మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన వెంకట హరీష్ కొత్తగా ఆలోచించాడు. ఆదివారం హరీష్, అనూషల పెళ్లి మహానందిలో జరిగింది. ఈ మేరకు యువ భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హరీష్ సుమారు 20 మంది యువకులతో రక్తదానం చేయించి సేవా గుణాన్ని చాటుకున్నారు. పలువురు అతడిని అభినందించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



క్వార్టర్ ఫైనల్లో తలపడుతున్న హాకీ జట్లు

- సెమీస్‌కు కర్నూలు బాలుర జట్టు

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి హాకీ బాలుర చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం పోటీలను రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

రెండో రోజు ఫలితాలు..

క్వార్టర్ ఫైనల్స్‌లో కర్నూలు జట్టు 1–0 స్కోర్‌తో నెల్లూరు జట్టుపై నెగ్గింది. కర్నూలు జట్టులో రైటింగ్ ఆటగాడు వంశీ తనకు వచ్చిన అవకాశాన్ని గోల్‌గా మలిచాడు. రెండో క్వార్టర్ ఫైనల్లో గుంటూరు జట్టు 5–2 గోల్స్ చేసి అన్నమయ్య జట్టుపై నెగ్గింది. మూడో క్వార్టర్ ఫైనల్లో తిరుపతి జట్టు 2–1 స్కోర్‌తో అనకాపల్లి జట్టుపై విజయం సాధించింది.

ఏటీఎం సాగుతో నిరంతర ఆదాయం



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయ భాగస్వామ్యంతో ఏటీఎం మోడల్ పంటలు సాగు చేయడంతో కుటుంబానికి అవసరమైన కూరగాయలు లభించి ఆరోగ్యంతో పాటు నిరంతరం ఆదాయం వస్తుందని నంద్యాల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి అన్నారు. గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు బాలమద్దిలేటి పొలాన్ని ఆదివారం పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సెంట్ల సొంత పొలంలో రైతు ఏటీఎం మోడల్‌లో కూరగాయలు సాగు చేశారన్నారు. ఈ పద్ధతిలో మొదటగా నాలుగు అడుగుల వెడల్పు బెడ్డు, ఒక్క అడుగు వెడల్పు కాలువను ఏర్పాటు చేసుకొని భూమిని తయారు చేసుకోవాలన్నారు. గడ్డజాతి అయినటువంటి ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్ మొక్కలకు ఆరు ఇంచుల వ్యత్యాసం, మిర్చి, వంగ, టమాట, గోరుచిక్కుడు, అలసంద మొక్కలకు ఒక అడుగు వ్యత్యాసం, మొక్కజొన్నకు రెండు అడుగుల వ్యత్యాసంతో వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సరిహద్దులో తీగజాతి రకాలు అయిన బీర, కాకర, సొర వేసుకోవాలని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని, ఈ పద్ధతిపై రైతులు పంటలు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సలాం, ఏపీసీఎస్ సిబ్బంది, పొదుపు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులంతా సురక్షితం



పగిలిన కర్ణాటక ఆర్టీసీ బస్సు అద్దాలు

ఆలూరు: కర్నూలు నుంచి బళ్లారి వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సును ఆలూరు సమీపంలో ఆదివారం లారీ ఢీ కొట్టింది. బస్సుకు ముందు భాగంలో అద్దాలు పగిలిపోగా అందులో ఉన్న 55 మంది సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్, కండక్టర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కండక్టర్ హనుమంతప్ప ఫిర్యాదు మేరకు ఆలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

కృష్ణగిరి: క్షణికావేశంలో దంపతులు పురుగుల మందు తాగగా..భార్య మృతి చెందింది. భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కృష్ణగిరి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కమ్మ గంగాధర్‌కు ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన కమ్మ మానస(27)కు ఆరున్నర ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. శనివారం సాయంత్రం గంగాధర్ అదనపు కట్నం కోసం భార్య మానసను వేధించారు. విషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు తాము వచ్చి మాట్లాడుతామని చెప్పారు. అయితే రాత్రి పొద్దుపోయాక భార్యాభర్తలిద్దరూ క్షణికావేశంలో పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వారిని కర్నూలు ప్రభుత్వ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మానస మృతి చెందారు. ఆమె భర్త గంగాధర్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. మృతిరాలి తండ్రి నారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తతోపాటు అత్తమామ, బావలు రామచంద్ర, నాగరత్నమ్మ, రమేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన కమ్మ మానస

నేడు ఆర్‌యూ నూతన రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ నాగుల అంకన్న సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం వర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ స్థానంలో ఈయన నియమితులయ్యారు. వైఎస్సార్ కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన ఒక ఏడాది పాటు ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

పటిష్ట పర్యవేక్షణలో ప్రసాదం తయారీ



భ్రమరాంబాదేవి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయ శాస్త్రి, వేదపండితులు గంటి రాధాకృష్ణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో ప్రసాదాన్ని పటిష్ట పర్యవేక్షణలో తయారీ చేస్తామని శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, వేద పండితులు గంటి రాధాకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులకు వితరణ చేసే పులిహోర ప్రసాదంలో ఎముక వచ్చిందనేది వాస్తవం కాదన్నారు. రోజువారి ప్రసాదాల తయారీ కూడా ప్రధాన అర్చకుల పర్యవేక్షణలోనే జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు అన్ని ప్రసాదాల పాత్రలపై మూతలను పెడుతుంటామని, వైదిక సిబ్బంది తప్ప ఇతరులు పాకశాలలో ప్రవేశించే వీలుండదని వారు స్పష్టం చేశారు. శ్రీశైలక్షేత్ర ప్రతిష్టను, భక్తుల మనోభావాలను భంగపరిచేలా అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదన్నారు.

కలెక్టరేట్ ఆధునీకరణ పనులు వేగవంతం



జేసీ పేషీలో తుదిదశ పనులు జరుగుతున్న దృశ్యం



కలెక్టరేట్ సెక్షన్లలో వేగంగా జరుగుతున్న పనులు

- నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఆధునీకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నెలాఖరులోపు వీటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఇటీవల సమీక్ష నిర్వహించారు. భవనాలు 40 ఏళ్ల క్రితం నిర్మించిన కావడంతో మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని భవనాలు పెచ్చులు ఊడి పడుతుంటే..మరికొన్ని కార్యాలయాల్లో కనీసం సున్నం వేయించలేని దుస్థితిని కలెక్టర్ గమనించారు. కలెక్టరేట్ దుస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.8.08 కోట్లను మంజూరు చేయించారు. జిల్లా ఇన్‌చార్జి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సైతం కలెక్టరేట్‌ను పరిశీలించి అందంగా తీర్చిదిద్దాలని సూచించారు.

ప్రాధాన్యత క్రమంలో..

కలెక్టరేట్ భవనాన్ని ప్రాధాన్యత క్రమంలో ఆధునీకరించేందుకు గతంలో పనిచేసిన కలెక్టర్లు కూడా చర్యలు తీసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాలు, మినీ కాన్ఫరెన్స్ హాలు, హౌసింగ్ పీడీ కార్యాలయం, సీపీఓ, డీఆర్వో, ఏఓ కార్యాలయాలను ఆధునీకరించారు. కలెక్టర్‌గా డాక్టర్ సృజన వచ్చిన తరువాత కలెక్టర్ చాంబరు, కాన్ఫరెన్స్ హాళ్ల ఆధునీకరణ జరుగుతోంది. గతంలోనే జేసీ కార్యాలయాన్ని ఆధునీకరించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మిగిలిన కార్యాలయాలను ఆధునీకరించేందుకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన చర్యలు తీసుకున్నారు.

వేగవంతమైన పనులు...

కలెక్టరేట్ ఆధునీకరణ పనులను చేపట్టేందుకు ఆర్కిటెక్ వేణుగోపాల్‌తో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. మొదట అన్ని కార్యాలయాల్లో మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పెయింటింగ్‌ను తక్షణమే వేయించాలని సూచించారు. గాలి, వెలుతురు వచ్చేలా చూడాలని, 24 గంటల పాటు కలెక్టరేట్‌లో కరెంట్ వచ్చేలా చూడాలని, కలెక్టరేట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మాస్టర్‌లో రూపొందించారు. సునయన ఆడిటోరియాన్ని అందగా తీర్చిదిద్దడం, కలెక్టరేట్ ముందు భాగం అందంగా కనిపించేలా వివిధ డిజైన్లను ఎంపిక చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8.08 కోట్లను మంజూరు చేసింది. రోడ్లు, భవనాల శాఖ ద్వారా టెండర్లను పిలిచి పనులను ప్రారంభించారు. ఉత్తర భాగంలో రూ.45 లక్షలు, దక్షిణ భాగంలో రూ.23 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.45 లక్షలను కేటాయించారు. సునయన ఆడిటోరియాన్ని అందంగా తీర్చిదిద్దడం కోసం రూ.1.23 కోట్లను కేటాయించారు. అంతేగాక కలెక్టరేట్ ముందు భాగం, దక్షిణ భాగంలో వివిధ కార్యాలయాల ఫ్లోరింగ్, గోడలు, టాయిలెట్లు, కిటికీలు, పెయింటింగ్, అంతర్గత మరమ్మతులు, వెంటిలేటర్లకు తక్షణం మరమ్మతుల కోసం రూ.70 లక్షలు కేటాయించారు. ఉత్తర భాగంలో కార్యాలయాల్లోని రిపేర్లు, సన్‌షెడ్లు, పెయింటింగ్, బయటి గోడలకు సున్నం, పెయింటింగ్ తదితర పనుల కోసం రూ.50 లక్షలను కేటాయించారు. అలాగే ఎస్‌ఆర్‌బీసీ బ్లాక్‌లో మరమ్మతుల కోసం రూ.77 లక్షలు, వివిధ కార్యాల్లో ఫ్లోరింగ్, గోడలు, టాయిలెట్లు, కిటికీలు, విండోల నిర్మాణం కోసం రూ.1.85 లక్షలను కేటాయించారు. అలాగే డీఈఓ కార్యాలయాలమరమ్మతుల కోసం 1.90కోట్లను కేటాయించారు. ప్రస్తుతం ఆయా పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

పది రోజుల్లో పనులు పూర్తి



కలెక్టరేట్ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.8.08 కోట్లతో వివిధ పనులను ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పది రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సునయన ఆడిటోరియం పనులు వేగంగా సాగుతున్నాయి. అధికారులు బాధ్యతగా కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్